క్లుప్తంగా

స్టేషన్‌బస్తీలో కరకట్ట నిర్మించాలి

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్‌బస్తీలో బుగ్గవాగు వెంట నివసిస్తున్న ప్రజలు వానాకాలం వాగు పొంగినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బుగ్గవాగు మీద కరకట్ట నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ అన్నారు. ఆదివారం స్టేషన్‌బస్తీలో రాంచరణ్ పాసీ స్తూపం వద్ద జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా వాసం మాధవిని ఎన్నుకున్నారు. ఆలేటి కిరణ్‌కుమార్, మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, వాసం రాము, పూల్‌కుమారీ, బాలరాజుపాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

జూలూరుపాడు: పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గంలో జూలూరుపాడు మండలం నుంచి ఇద్దరికి చోటు దక్కింది. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా కాకర్ల హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు కంటేపూడి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా పాపకొల్లు హైస్కూల్ ఉపాధ్యాయుడు కె.హరిలాల్ ఎన్నికయ్యారు.

ఆర్థిక సాయం

పాల్వంచరూరల్: ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధి ఒడ్డుగూడెంలో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ఆదివారం జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50కేజీల బియ్యం, రూ.6వేల నగదు అందజేశారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

టేకులపల్లి: సులానగర్ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అగస్టీన్ ఆధ్వర్యంలో చర్చి 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సులానగర్, కోయగూడెం, మాలపల్లి, ముత్యాలంపాడు క్రాస్ రోడ్, టేకులపల్లి గ్రామాల నుంచి క్రైస్తవులు భారీ ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు కొమ్ము అంతోని, సుధాకర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుందాం..

ఇల్లెందు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలను ఆదుకునేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు ధారా రమేష్ అన్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి సత్రంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు రాజకీయాలలోకి వస్తే వారికి సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఝెలుగూరి నగేష్‌కుమార్, తాత శ్రీనివాస్, పొద్దుటూరి నాగేశ్వరరావు, ఆర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రల అను, పుల్లూరి జ్యోతి, పల్లెర్ల చంద్రశేఖర్, కండె రమేష్, సాయి, బసవయ్య, విజయ్, మధు, రాజశేఖర్, సురేష్, పవన్, రాకేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మద్యం దందా..



రేగులతండాలో మద్యం గోడౌన్

టేకులపల్లి: యథేచ్ఛగా మద్యం సిండికేట్ దందా కొనసాగుతోంది. టేకులపల్లి మండలంలో మొత్తం నాలుగు మద్యం షాపులు ఉన్నాయి. ఒక్కో షాపుకి ఒక గోడౌన్ ఉండాలి. కానీ నాలుగు షాపులకు కలిపి రేగులతండాలో ఒకే గోడౌన్‌ని ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి మద్యాన్ని వైన్ షాపులకు మాత్రమే తీసుకెళ్లాలి. కానీ మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ ఎస్‌ఐ అచ్చారావును వివరణ కోరగా... గోడౌన్ నుంచి వైన్ షాపులకే మద్యం తీసుకెళ్లాలి. బెల్ట్ షాపులకు అనుమతి లేదు. అధిక ధరలకు మద్యం విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైద్యుల కొరత ఇంకెన్నాళ్లో?

- మాతాశిశు ఆస్పత్రిలో 15 మంది వైద్యులకు గాను ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- స్కానింగ్ మిషన్ ఉన్నా.. రేడియాలజిస్ట్ లేడు
- రోజుకు 100 పైగా ఓపీ
- సీటీజీ, బ్లడ్ బ్యాంక్ లేని 100 పడకల మాతాశిశు ఆస్పత్రి



వైద్యం కోసం మాతాశిశు ఆస్పత్రికి వచ్చిన ప్రజలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరంలోని మాతాశిశు ఆస్పత్రిలో వైద్యుల కొరత రోగుల పాలిట శాపంగా మారింది. రూ.కోట్లతో నిర్మించిన ఆస్పత్రిలో ప్రధాన వైద్యులతోపాటు, అనస్తీషియా, రేడియాలజిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రకారం జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో సుమారు 15 మంది, కనీసం 12 మందైనా వైద్యులు ఉండాలి. అంతేకాకుండా జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు అనుసంధానంగా కొనసాగుతున్న ఈ ఆస్పత్రిలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రం ఉండటం గమనార్హం.

దూరప్రాంతాల నుంచి పేషంట్లు..

ఏజెన్సీ ప్రాంతమైన ఈ జిల్లాలో రాత్రి పగలు తేడా లేకుండా దూరప్రాంతాల నుంచి డెలివరీ, ఇతరత్రా సమస్యలపై మహిళలు ఆస్పత్రికి వస్తుంటారు. కొన్ని సమయాల్లో హైరిస్క్ కేసులు కూడా వస్తుంటాయి. వీరికి స్కానర్ ద్వారా పరీక్షలు చేయాల్సి ఉంటుంది. రేడియాలజిస్ట్ లేకపోవడంతో పేషంట్లను బయటికి (స్కానింగ్ కోసం) పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. రెండు నెలలుగా ఈ పరిస్థితి ఉన్నా.. అధికారులు పట్టించుకోకపోవటం బాధాకరం.

సీటీజీ మిషన్, బ్లడ్ బ్యాంక్ లేని పరిస్థితి...

వారంలో సుమారు రెండు హైరిస్క్ కేసులు తప్పనిసరిగా వస్తుంటాయి. వారు ఖమ్మం, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా సమీపంలోని మాతాశిశు ఆస్పత్రికి వస్తుంటారు. వారికి కొన్ని సందర్భాల్లో బ్లడ్ అవసరం ఉంటుంది. ఇక్కడ బ్లడ్ బ్యాంక్ లేక బయటి బ్లడ్ బ్యాంకులను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఈ ఖర్చు భరింతచేక రోగులు ఆవేదన చెందుతున్నా రు. అంతేకాకుండా హైరిస్క్ కేసులకు ఉండాల్సిన సీటీజీ మిషన్ (నాన్ ట్రెస్ టెస్ట్) కూడా లేదు. కొన్ని సంవత్సరాలుగా అధికారులు అదిగో ఇస్తాము.. అదిగో ఇస్తాము.. అంటున్నారే తప్ప ఇచ్చిన దాఖలాలు లేవు. ఆస్పత్రి బాగానే ఉన్నా సౌకర్యాలు లేవని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఎక్స్‌రేకు కూడా ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది.

రెస్ట్ లేకుండా డ్యూటీ చేస్తున్నాను..



ఆస్పత్రిలో లేబర్ రూమ్‌లో ఒకరు, ఓపీలో ఒక డాక్టర్ తప్పనిసరి. అంతేకాకుండా మెడికల్ కళాశాల నుంచి ట్రైనీస్ వస్తే వారికి సబ్జెక్ట్ చెప్పటానికి ప్రొఫెసర్ స్థాయి వైద్యులు లేరు. ప్రధానంగా రెండు నెలల నుంచి ఆర్‌ఎంఓ కూడా లేరు. ఒకరు 12 గంటలు పనిచేస్తే, మరొకరు 12 గంటలు పనిచేయాల్సి వస్తోంది. అంకితభావంతో పనిచేస్తూ 100శాతం మెటర్నిటీ డెత్ తగ్గించాము. కాలు ఫ్యాక్చర్ అయినా వీల్‌చైర్‌లో వచ్చి రెండు నెలలుగా రెస్ట్ లేకుండా డ్యూటీ చేస్తున్నాను. – సాగరిక, డ్యూటీ డాక్టర్

మాస్టర్ ప్లాన్‌తోనే ఇల్లెందు అభివృద్ధి



శ్రీనివాసరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

ఇల్లెందు: ఇల్లెందును అభివృద్ధి చేయాలంటే మాస్టర్ ప్లాన్ అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జేకే ఓసీ విస్తరణలో ఓబీ, బొగ్గు వెలికితతీ సింగరేణి కార్మికులతో చేపడితే 1000 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇందుకోసం సీపీఐ, ఏఐటీయూసీ కృషి చేస్తుందన్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతోపాటు తాను పట్టుబట్టడంతో కాంట్రాక్ట్ కార్మికులకు కూడా 5 శాతం లాభాల వాటా చెల్లించేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి ఆశించినంత ముందుకు సాగలేకపోతున్నారని, హామీలు అమలు చేయకనే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష స్థానానికి వెళ్లిందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. నక్సలైట్లు, మావోయిస్టులు, దేశంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఐక్యం కావాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. పక్క దేశం శ్రీలంకలో ఎర్రజెండా రాజ్యం సిద్ధించిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడుతూ త్వరలో ఖమ్మంలో సీపీఐ జాతీయ మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. కాగా కూనంనేని సమక్షంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాస శ్రీనివాస్, మరికొందరు నాయకులు సీపీఐలో చేరారు.

చుంచుపల్లి: రామాంజనేయ కాలనీ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సరిత, నాయకులు జ్ఞాన మూర్తి నాని, నల్ల రాము తదితరులు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా సమక్షంలో పార్టీలో చేరారు. రజబ్ అలీ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి, ప్రాథమిక సభ్యత్వం అందించారు. వాసిరెడ్డి మురళి, మాచర్ల శ్రీనివాస్, నూనావత్ గోవిందు, రాంజీ, యాంద్ర మహేష్, నగేష్, మేడి అజయ్, బషీర్, ఎర్ర యాకుబ్, ఎండి యాకూబ్, జానకిరామ్, జాఫర్, భాగం మహేశ్వరావు, మాధవరావు, భాగం కృష్ణ, రామారావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

కులవ్యవస్థ నిర్మూలనకు పోరాడుదాం..



మాట్లాడుతున్న ముద్దా భిక్షం

సింగరేణి(కొత్తగూడెం): కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుదామని, సనాతన పద్ధతులను వ్యతిరేకిద్దామని సీపీఎం(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అన్నారు. ఆదివారం ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జిల్లా కోశాధికారి పెద్దబోయిన సతీష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కులవ్యవస్థ నిర్మూలనపై చర్చించారు. మాట్లాడుతూ సమాజాభివృద్ధి క్రమంలో వృత్తుల ఆధారంగా ఏర్పడిన వర్ణం కాలక్రమంలో కులంగా ఆవిర్భవించిందని, దీనిని దోపిడీ పాలకవర్గాలు పెంచిపోషించాయని, ఇవి ప్రజల్ని గౌరవప్రదంగా, సమానంగా బతకనివ్వటం లేదన్నారు. కాబట్టి కులవ్యవస్థను రూపుమాపాలన్నారు. దేశంలో ఫ్యూడల్ వ్యవస్థ అమలవుతున్న కాలంలో అవమానాలను ఎదుర్కొన్న జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి వంటి వారు 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక్ సమాజం ఏర్పాటు చేసి కుల నిర్మూలనకు కృషి చేశారని, ముఖ్యంగా దళిత కులాల విద్యాభివృద్ధికి, విజ్ఞాన అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల సత్యం, బానోత్ ధర్మ, ఆర్.మధుసూదన్‌రెడ్డి, షేక్ యాకూబ్‌షావలీ, వై.గోపాలరావు, గోనేల రమేష్, మల్సూర్, సుందర్ చంద్రశేఖర్, నాగమ్మ, శంకర్, నరసింహా, రోజా, కృష్ణ, మైబూబీ పాల్గొన్నారు.

సీఎం తప్పుడు ప్రమాణాలను క్షమించండి..

- ఆంజనేయస్వామిని వేడుకున్న బీఆర్‌ఎస్ నాయకులు



ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాల గురించి దేవునిపై ప్రమాణం చేసి మాటతప్పిన ముఖ్యమంత్రి తీరుతో రాష్ట్ర ప్రజలపై ఆగ్రహించొద్దని వేడుకుంటూ ఒడ్డుగూడెం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఆంజనేయస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు భావ్‌సింగ్, పూనెం లింగమ్మ, భూక్య సురేష్‌నాయక్ మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీ వరకు రైతులందరికీ రుణమాఫీ చేస్తానని దేవుళ్లందరిపై సీఎం ప్రమాణం చేశారని గుర్తుచేశారు. నేటికీ అమలు చేయకుండా రైతులతోపాటు దేవుళ్లను కూడా మోసం చేశాడని ఆరోపించారు. దేవుళ్లపై అబద్ధపు ప్రమాణాలు చేసిన ముఖ్యమంత్రి వల్ల రాష్ట్ర ప్రజలకు ఎటువంటి హాని జరగకూడదని భావించి క్షీరాభిషేకం, పూజలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జోగ శేషగిరి, భూక్యా బజారి, మాలోత్ సుజాత, ఘాజీ, ఆజ్మీర రాందాస్, జాన్‌బాబు, శ్రీను, రామకృష్ణ, అరెం స్వామి, అశోక్, మంగీలాల్, ధర్మ, అశోక్, వీరు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

టేకులపల్లి: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కోయగూడెం గ్రామంలో కోయగూడెం సీపీఎం గ్రామశాఖ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ఇంటి స్థలం, ఇళ్లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

పెట్టుబడిదారులకు పాలకుల ప్రోత్సాహం

పాల్వంచరూరల్: దేశానికి అన్నం పెడుతున్న రైతులకు ధరలు కల్పించడం లేదు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా కేంద్రంలోని పాలకులు పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నారని సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) పెద్ద చంద్రన్న పార్టీ జిల్లా బానోతు శుక్లా విమర్శించారు. రెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడుతూ... వీరమల్ల ఉమ, క్లెం కళింటరెడ్డి, మల్లన్న తదితరులు పదికుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారని తెలిపారు. పనిచేసేవారు ఒకరైతే, శ్రమ దోపిడీ చేసేవారు ఇంకొకరని ఇలాంటి దోపిడీ లేని నూతన సమాజం కోసం పాలకులు పనిచేయాలన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

పాల్వంచరూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ నేతలపై ఈడీ దాడులు చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పట్టణంలో ఆదివారం కార్యకర్తల మాట్లాడారు. గతంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈడీ దాడులు జరిగాయి. ప్రభుత్వ సొమ్ము దోచుకునేవారిపై ఈడీ చర్యలు తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజలే గుణపాఠం చెప్పుతారన్నారు. శ్రీధర్, గాంధీనాయక్, బాలాజీ, గుగులోతు శంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బంజారా స్కూల్‌ను సందర్శించిన జీఎం



స్కూల్ విద్యార్థులతో జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: గార్లలోని బంజారా సేవా సమితి స్కూల్‌ను సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదివారం సందర్శించి పరిశీలించారు. సామాజిక బాధ్యతతో రెండు అదనపు గదుల నిర్మాణం చేయగా అధికారులతో కలిసి వాటిని పరిశీలించారు. ఆయన వెంట డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సివిల్ ఇంజనీర్ వెంకటేశం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం

ఇల్లెందు ఏరియా జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో పునఃనిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టును ఏరియా జీఎం జాన్‌ఆనంద్ ఆదివారం ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ మైదానంలో సెంట్రల్ లైటింగ్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లలకు పార్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూజీఎం బి. వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ ఆనంద్, డీజీఎం సివిల్ రవికుమార్, అధికారుల సంఘం అధ్యక్షులు శివప్రసాద్, ఏరియా ఇంజనీర్ నాగరాజు నాయక్, గుర్తింపు సంఘం ప్రతినిధి యాదగిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేటు ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషీ అన్నారు.

ఆదివారం స్థానిక ఉర్దూఘర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ – టెక్నీషియన్స్ ట్రేడ్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ అధ్యక్షతన జరిగింది. నయీమ్ ఖురేషి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రతి ఎలక్ట్రీషియన్ వారి వృత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడల అంజయ్య, షర్ఫుద్దీన్, బాలరాజు, రఘురామ్, షేక్ హసీమ్ షరీఫ్, ఎండీ.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కేఓసీలో బొగ్గు ఉత్పత్తిపై సమీక్ష



మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్

టేకులపల్లి: కార్మికులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కోయగూడెం ఉపరితల గనిలో ఏరియా అధికారులతో పీఓ కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత రవాణాపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

అధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం బొగ్గు రవాణా లారీ యాజమాన్యంతో చర్చలు జరిపి రవాణాను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, మేనేజర్ సౌరబ్ సుమన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ శివశంకర్, నవ భారత్, ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటీడీఏకు కీర్తిప్రతిష్టలు తేవాలి



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

పాల్వంచరూరల్: క్రీడల్లో విద్యార్థినులు ప్రతిభ చూపి డివిజన్‌కు, ఏటీడీఏకు కీర్తిప్రతిష్టలు తీసుకరావాలని ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్ అన్నారు. మండల పరిధి కిన్నెరసానిలోని గిరిజన క్రీడాపాఠశాలలో రెండురోజులు నిర్వహించనున్న డివిజన్ స్థాయి గిరిజన క్రీడా పోటీల ఎంపికను ఆదివారం ఏటీడీడబ్ల్యూఓ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలన్నారు. తొలిరోజు నాలుగు పాఠశాలల నుంచి 130 మంది బాలికలు హాజరు కాగా సీనియర్ విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. 102మంది క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



షాట్‌పుట్ విసురుతున్న విద్యార్థిని

ఇల్లెందురూరల్: క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు క్రీడలతో అలవడుతాయని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఏటీడీఓ సూర్నపాక రాధ అన్నారు. ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, జూలూరుపాడు మండలాల జోనల్ స్థాయి క్రీడల ఎంపికలను ఆదివారం మండలం బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఏటీడీఓ సూర్నపాక రాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు నేడు సెల్‌ఫోన్, టీవీలకు అతుక్కుపోయి క్రీడలను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి మాత్రమే వినియోగించాలని సూచించారు. పలు క్రీడాంశాలలో బాలికలకు పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దనసరి నాగమణి, స్థానికులు చీమల వెంకటేశ్వర్లు, మోకాళ్ళ రమేష్, ఉపేందర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు మైదానం ?

- సింగరేణి గ్రౌండ్ మీదే గంపెడాశలు
- ట్రాఫిక్‌కు ఇబ్బంది అయ్యే అవకాశం
- వేడుకలకు ఫారెస్టు గ్రౌండ్ అనుకూలం
- అనుమతి లభించేనా..?



సింగరేణి స్కూల్ గ్రౌండ్

ఇల్లెందు: దసరా ఉత్సవాలకు మైదనాలు కరువయ్యాయి. పట్టణంలోని జేకే సింగరేణి స్కూల్ గ్రౌండ్ మీదే ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. అయితే ఈ గ్రౌండ్ ట్రాఫిక్ సమస్యలను సృష్టిస్తోంది. ఏటా ఈ గ్రౌండ్‌లోకి వెళ్లాలన్నా ఒకే గేట్ నుంచి వెళ్లి రావటం కష్టంగా ఉంటోంది. గత ఏడాది వర్షం వల్ల లోపలికి వెళ్లిన వారు బయటకు రావటం తలకు మించిన భారంగా మారింది. ఫారెస్టు గ్రౌండ్ అనుకూలంగా ఉంటుంది కానీ, ప్రస్తుతం వివాదంతో న్యాయస్థానం ఆధీనంలోకి వెళ్లటం వల్ల ఆ గ్రౌండ్ అనుమతి వచ్చే అవకాశం లేదు. మూడేళ్ల నుంచి దసరా ఉత్సవాల సమయాల్లో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలతో చర్చలు జరిపినప్పటికీ ఫలించలేదు.

దసరా ఉత్సవాలకు ఫారెస్టు గ్రౌండ్ కోర్టు పరిధిలోకి, జమ్మి ఉత్సవ గ్రౌండ్ మిషన్ స్కూల్ పరిధిలోకి వెళ్లడంతో ఉత్సవాల కళ తప్పింది. దీంతో ఇక మిగిలింది సింగరేణి స్కూల్ గ్రౌండే కావటంతో దాని మీదే ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు గంపెడాశలు పెట్టుకుంటున్నారు. అయితే ఉత్సవాల కోసం సాంస్కృతిక కార్యక్రమాల స్టేజీ, ఇటు రావణవధ, మరోవైపు జమ్మి పూజ, విగ్రహాల రాక కలగలిపి అన్ని సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లోనే నిర్వహించాల్సి రావటంతో గ్రౌండ్ సరిపోవటం లేదు. ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. గ్రౌండ్‌ను శుభ్రం చేయటంతో పాటు రెండు మూడు ద్వారాలు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఏటా ఇల్లెందులో మైసూర్ తరహాలో దసరా ఉత్సవాలు జరుగుతుంటాయి.

సింగరేణి గ్రౌండ్‌లోనే ఉత్సవాలు..



ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో అధికారులు, కౌన్సిల్ సహకారంతో ఈసారి కూడా జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు ఉంటాయి. మున్సిపల్ అధికారులు, పాలకవర్గంతో చర్చించి గ్రౌండ్‌లోనే ఏర్పాట్లు చేస్తాము. వీక్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాము.

– డీవీ,మున్సిపల్ చైర్మన్, ఇల్లెందు

వేడుకలు కళకళ లాడాలి..



ఏటా దసరా ఉత్సవాల వన్నె తగ్గిపోతుంది. ఈసారైనా అందరితో చర్చించి పట్టణ ప్రజలకు ఆనందం కలిగించేలా ఏర్పాట్లు చేయాలి. ఫారెస్టు గ్రౌండ్‌లో అయితే పక్కనే జమ్మి పూజ ఉండేది. రథాలు వచ్చి పూజలు చేసుకునే అవకాశం కూడా ఉండేది. కానీ ఇప్పుడు ఆ అవకాశం లేదు. ఉత్సవాలతో పాటు పూజలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– కె. సంజీవరెడ్డి, ఇల్లెందు

‘సాహితి’లో ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్లు రవి, కల్పన

ఇల్లెందు: సాహితి జూనియర్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. హాజరైన రావూస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు రవికుమార్, కల్పన మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే లక్ష్యాలను చేరుకోగలుగుతారని సూచించారు. ఏ స్థాయికి ఎదిగినా తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్/రూరల్: కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1992–94లో ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం అదే కాలేజీలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని రోజంతా సరదాగా గడిపారు. ఆటపాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం ఆనాటి అధ్యాపకులు, ప్రస్తుత ప్రిన్సిపాల్ కత్తి రమేష్‌లను ఘనంగా సన్మానించారు.



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పదిహేనేళ్ల క్రితం డిగ్రీ మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులు ఒక్కచోట కలుసుకున్నారు. నాటి మధుజ్ఞాపకాలను మననం చేసుకుంటూ ముచ్చటించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు దిండిగల రాజేందర్, పులిగళ్ల మాధవరావు పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.